# బ్రహ్మ జ్ఞానావలీమాలా

1. సకృత్, శ్రవణమాత్రేణ బ్రహ్మజ్ఞానం యతోభవేత్

బ్రహ్మజ్ఞానావలీమాలా సర్వేషాం ముక్తి సిద్ధమే ।

బ్రహ్మజ్ఞానమును వినిపించుట మాత్రమునే మోక్షసిద్ధి కలిగించగల ఈ బ్రహ్మజ్ఞానావలీమాల చెప్పుచున్నాము.

2. అసంగోఽహం అసంగోఽహం అసంగోఽహం పునః పునః

సచ్చిదానందరూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నేను ఎవరితోను, వేటితోను, ఎటువంటి సన్నిహితసంబంధ బాంధావ్యాలు లేని అసంగుడనని దృఢముగా మరల మరల చెప్పగలను. నేను సత్యనిత్య స్వరూపుడను, జ్ఞాన స్వరూపుడను, ఆనంద స్వరూపుడను, మార్పు, నాశము లేని ఆత్మస్వరూపుడను నేనే.

3. నిత్యశుద్ధవిముక్తః అహం నిరాకారః అహం అక్షరః

భూమానంద స్వరూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నేను నిత్యశుద్ధుడను, నిత్యముక్తుడను, నిరాకారుడను, నాశనము లేని వాడిని, నిత్యానంద స్వరూపుడను, మార్పు, నాశము లేని ఆత్మస్వరూపుడను.

4. నిత్యః అహం నిరవధ్యః అహం నిరాకారహ అహం అచ్యుతః

పరమానంద రూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నాకు దోషములూ లేవు, ఆకారమూ లేదు. అందుచే నాకు క్షీణించుట అనునది లేదు. నాది పరమానంద స్వరూపము . నేను మార్పు, నాశములేని ఆత్మ స్వరూపమును.

5. శుద్ధ చైతన్య రూపః అహం ఆత్మారామః అహం ఏవచ

అఖండానందరూపః అహం అహం ఏవ అహం అవ్యయః ॥

నేను శుద్ధ చైతన్య స్వరూపమును. ఆత్మారాముడను నేను. అఖండమైన ఆనంద స్వరూపము నాది. మార్పు, నాశములేని ఆనంద స్వరూపము నేను.

6. స్వయం ప్రకాశ రూపం అహం చిన్మయః అహం పరోఽస్మ్యహం

అద్వైతానంద రూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నేను స్వయముగా ప్రకాశింపగలను. నేను జ్ఞానస్వరూపమును, పరమాత్మను. అద్వైతానంద రూపము నాది. మార్పు, నాశము లేని ఆత్మ స్వరూపమును నేను.

7. ప్రత్యక్ చైతన్యరూపః అహం శాంతః అహం ప్రకృతే పరః
శాశ్వత ఆనంద రూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నేను ప్రత్యక్ - చైతన్య స్వరూపమైన అంతరాత్మను. నేను శాంత స్వరూపమును. ప్రకృతికి అతీతుడను, శాశ్వతమైనట్టి ఆనంద స్వరూపమును, మార్పు, నాశము లేని ఆత్మస్వరూపమును నేను.

8. తత్త్వాతీతః పరాత్మః అహం మధ్యాతీతః పరః శివః
మాయాతీతః పరం జ్యోతిః అహం ఏవ అహం అవ్యయః ॥

నేను తత్త్వాలకు అతీతుడను. పరాత్మను. మధ్యాతీతుడను అనగా శరీరాతీతుడగు పరమశివుడను. మాయతీతుడను. పరంజ్యోతి స్వరూపమును నేను.మార్పు నాశములేని ఆత్మ స్వరూపమును నేను.

9. నామరూప వ్యతీతః అహం చిదాకారః అహం అచ్యుతః
సుఖ ప్రకాశ రూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నాకు నామరూపములు లేవు. జ్ఞానమూర్తిని నేను. నాకు క్షయము లేదు. సుఖ స్వరూపుడను, ప్రకాశ స్వరూపుడను. నేను మార్పు నాశములేని ఆత్మస్వరూపమును నేను.

10. మాయ తత్‌కార్యదేహాది మమ నాస్త్యేవ సర్వదా
స్వప్రకాశైక రూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నేను మాయను కాదు. మాయ కార్యమైన దేహాదులనూ ఎన్నటికిని కాను. స్వప్రకాశమైన ఏకైక (అద్వైత) స్వరూపము నాది. మార్పు, నాశనము లేని ఆత్మస్వరూపమును నేను.

11. గుణత్రయ వ్యతీతః అహం బ్రహ్మాదీనాం చ సాక్షిః అహమ్
అనంతానంద రూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

సత్వరజస్తమో గుణాలకు నేను అతీతము. బ్రహ్మాది దేవతలకు కూడా సాక్షిని నేను. అనంతమైన ఆనంద స్వరూపము నాది. మార్పు, నాశములేని ఆత్మ స్వరూపమును నేను.

12. అంతర్యామి స్వరూపః అహం కూటస్థః సర్వగోఽస్మ్యహమ్
పరమాత్మ స్వరూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నేను సర్వాంతర్యామిని,కూటస్థుడను(కూటస్థమునందు బ్రహ్మానుదర్శించువాడిని), స్వర్వగతుడను. పరమాత్మ స్వరూపుడను. మార్పు , నాశము లేని ఆత్మస్వరూపమును నేను.

13. ద్వందాది సాక్షిరూపః అహం అచలః అహం సనాతనః
సర్వసాక్షి స్వరూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నేను ద్వందాదులకు సాక్షిని. (చలి వేడి, కోపము శాంతము మొదలగునవి) చల నము లేని స్థిరస్వరూపము నాది. సర్వమునకు సాక్షిని నేను. మార్పు నాశము లేని ఆత్మ స్వరూపమును నేను.

14. ప్రజ్ఞాన ఘన ఏవ అహం విజ్ఞాన ఘన ఏవచ
అకర్తాహం అభోక్తాహం అహం ఏవ అహం అవ్యయః ॥

ప్రజ్ఞాన ఘనమూ, విజ్ఞాన ఘనమూ నేను, అనగా పరబ్రహ్మ స్వరూపమును నేను. కర్తనుగాని భోక్తను గాని కాను నేను. మార్పు నాశము లేని ఆత్మస్వరూపమును నేను.

15. నిరాధార స్వరూపః అహం సర్వధారః అహమ్ ఏవచ
ఆప్తకామ స్వరూపః అహం, అహం ఏవ అహం అవ్యయః ॥

నిరాధార స్వరూపమైన నేను సర్వమునకు ఆధార భూతమును. ఆప్తకామ స్వరూపు డను కూడా. మార్పు, నాశము లేని ఆత్మస్వరూపమును నేను.

16. తాపత్రయ వినిర్ముక్తః దేహత్రయ విలక్షణః
అవస్థాత్రయ సాక్షి అస్మిచ అహం ఏవ అహం అవ్యయః ॥

సంసారాది తాపత్రయములనుండి విముక్తుడను. స్థూలసూక్ష్మకారణ శరీర త్రయ ములకు భిన్నమైనట్టి నేను, జాగ్రత్, సుషుప్తి, స్వప్న అవస్థలు మూడింటికిని సాక్షిని మార్పు నాశములేని ఆత్మస్వరూపమును నేను.

17. దృగ్ దృశ్యౌ ద్వౌ పదార్థౌః స్తః పరస్పర విలక్షణౌః

దృగ్ బ్రహ్మ దృశ్యం మాయేతి సర్వవేదాంత డిండి మః ॥

దృక్ దృశ్య మను రెండు పరస్పర విరుద్ధ పదార్థములు కలవు. దృక్ అనగా చూచునది. అదే బ్రహ్మచైతన్యము, దృశ్యమనగా చూడబడునది, అదేమాయ, ఇదే వేదాంతముఘోషించునది.

18. అహం సాక్షి ఇతి యోవిద్యాద్ వివిచ్చేవం పునః పునః

స ఏవ ముక్తః స విద్వాన్ ఇతి వేదాంత డిండిమః ॥

నేను సాక్షి స్వరూపమును అనే జ్ఞానమును మరల మరల మనస్సునందు గ్రహించుకొనిన వాడు, జ్ఞాననిష్ఠ పొందినవాడు, వాడే విద్వాంసుడు, అతడే ముక్తుడు అని వేదాంతము ఘోషించుచున్నది

19. ఘటకుడ్యాదికం సర్వం మృత్తికా మాత్రమేవ చ

తద్వద్ బ్రహ్మ జగత్ సర్వం ఇతి వేదాంత డిండిమః ॥

కుండ, మట్టి గోడల అసలు రూపము మట్టియే. అదే విధముగా సర్వజగత్తు యొక్క నిజస్వరూపము బ్రహ్మమేనని వేదాంతము చాటి చెప్పుచున్నది.

20. బ్రహ్మ సత్యం జగత్ మిథ్యా జీవః బ్రహ్మైవ నా పరః

అనేనవేద్యం సచ్ఛాస్త్రం ఇతి వేదాంత డిండిమః ॥

బ్రహ్మం సత్యం జగత్ మిథ్యా, జీవాత్మ బ్రహ్మేగాని మరొకటి గాదు అనే సత్యాన్ని, సత్య శాస్త్రమైన, వేదాంతము ఘోషిస్తున్నది.

21. అంతర్జ్యోతిః బహిర్జ్యోతిః ప్రత్యగ్ జ్యోతిః పరాత్పరః

జ్యోతిర్జ్యోతిః స్వయం జ్యోతిః ఆత్మజ్యోతిః శివోస్మ్యహమ్ ॥

అంతఃకరణమందలి చైతన్య ప్రకాశమగుటచే అంతర్జ్యోతిగా పిలవబడునట్టి జ్యోతి, బాహ్యప్రపంచమునందలి చైతన్య ప్రకాశము కూడా నగుటచే బహిర్జ్యోతిగా పిలవబడు నట్టిజ్యోతి, జీవాత్మగా ప్రకాశించు నట్టిజ్యోతి, పరమాత్మగా ప్రకాశించునట్టి జ్యోతి, సూర్య చంద్రులు, అగ్ని వంటి జ్యోతుల ప్రకాశమునకు కారణ భూతమైనట్టి స్వయముగా జ్యోతి ప్రదమైన ఆత్మజ్యోతి, ఆ ఏకైక జ్యోతిని నేనే.

ఇతి శీమత్పరమహంస పరివ్రాజకాచారస్య శ్రీ గోవింద భగవత్పూజ్యపాద శిష్యస్య శ్రీ మచ్ఛంకర భగవతః కృతా బ్రహ్మజ్ఞానావలీమాలా సంపూర్ణము.